

- జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వైనం
- నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు
- పట్టణాలు..పల్లెలని తేడాలేకుండా ఏరులైపారుతున్న మద్యం
- కల్తీ మద్యానికి బలవుతున్న అమాయకులు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

యధేచ్ఛగా బెల్ట్ షాపులు



చింతలమానేపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బెల్టుషాపు దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. నియంత్రిం చాల్సిన సంబంధిత అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో పల్లెలు పట్టణాలని తేడాలేకుండా కిరాణా దుకాణం నుంచి మొదలుకొని నివాసగృహాల వద్ద మద్యం ఏరులై పారుతోంది. జిల్లాలో దాదాపుగా అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వివిధ రకాల పనులకు వెళ్లేవారికి తెల్లవారుజాము నుంచే మద్యం విక్రయిస్తున్నారు. పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో అడపాదడపా దాడులు నిర్వహిస్తున్నా..బెల్టు దందామాత్రం జోరుగా సాగుతోంది.

● మద్యం మత్తులో గ్రామాలు..

ఒకప్పుడు పట్టణప్రాంతాల్లోనే పరిమితమైన ఈదందా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా కొనసాగుతోంది. వార్డుకో దుకాణం చొప్పున ఏర్పాటు చేయడంతో గ్రామాల్లో జోరుగా మద్యం దందా సాగుతోంది. ఒక్కో గ్రామంలో సుమారుగా 10బెల్టుషాపుల వరకు ఉంటాయి. ఇందులో రోజుకు ఒక్కో బెల్టుషాపు నుంచి రూ.5నుంచి 10వేల మద్యం అమ్మకాలు జరిగితే సుమారుగా రోజుకు రూ.50వేల నుంచి లక్షవరకు మద్యం అమ్మకాలు ఒక్క గ్రామంలోనే జరుగుతున్నాయి. జిల్లాలో 335గ్రామ పంచాయతీలు, మరో 300వరకు అనుబంధ గ్రామాలు ఉండగా మద్యం దందా రోజుకు ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో దాదాపుగా వెయ్యికి పైగానే బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. బెల్టుదుకాణాల్లో మద్యం బాటిళ్లను ఎమ్మార్పీ కంటే రూ. 40నుంచి 50వరకు ఎక్కువ ధరలకు విక్రయిస్తూ అవసరమైతే మద్యాన్ని కల్తీచేస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పుతెస్తున్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో సైతం ఎప్పుడు అవసరమైతే అప్పుడు అన్ని వేళల్లో మద్యం లభిస్తోంది. గతంలో టీతాగడానికి హోటల్‌కు వెళ్లేవారు కానీ ప్రస్తుతం ఉదయం లేవగానే బెల్టు దుకాణానికి వెళ్తూ తమ ఆరోగ్యాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ వ్యవహారమంతా అధికారులకు తెలిసినా బెల్టు దందాపై కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలోని ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే బెల్టుదందాకు అడ్డుకట్ట పడే అవకాశాలున్నాయి. అతేకాకుండా ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పించిన వారవుతారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

● నేరుగా మద్యం షాపుల నుంచి రవాణా..

ఓవైపు గుడుంబా మానేసిన వారికి ప్రభుత్వం స్వయంఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే, మరోవైపు బెల్టు దుకాణాలు పల్లె, పట్టణప్రజలను మత్తులో ముంచెత్తుతున్నాయి. నిబంధనలకు వ్యతి రేకంగా గ్రామాల్లో బెల్టుదుకాణాలు కొనసాగుతున్నా.. చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతుందన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. జిల్లా లోని కొందరు మద్యం షాపుల వారే కమీషన్లకు బెల్టుషాపుల నిర్వహణ చేయిస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. బెల్టు షాపులు ఒక్కరిని చూసి ఒకరు పెడుతూ ఈదందానే జీవనోపాధిగా చేసుకుం టున్నారని తెలుస్తోంది.ఉదయం నుంచి సాయంత్రం దాకా..రాత్రి వేళల్లో సైతం మద్యం అందుబాటులో ఉంచుతూ ప్రజలను మత్తులో ముంచుతున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

● ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, జనవరి 12 (ఆంధ్ర జ్యోతి): బీజేపీ బలోపేతానికి కృషిచేయా లని ఆపార్టీ జిల్లాఅధ్యక్షుడు డాక్టర్ శ్రీని వాస్ అన్నారు. ఆదివారం ఆయన ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మం డల అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు. రాబోయే స్థానికసంస్థల ఎన్ని కల్లో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొట్నాక విజయ్, సీనియర్ నాయకులు అరిగెల మల్లికార్జున్, జిల్లా కోశాధికారి అరుణ్ లోయా, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోలేటివాసికి డాక్టరేట్

రెబ్బెన, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గోలేటికి చెందిన గుల్బం శ్రీధర్ డాక్టరేట్ పొందారు. 25సంవత్సరాలుగా ఉపాధ్యాయుల వృత్తిలో పనిచేసి విద్యావ్యవస్థలో చెరగని ముద్ర వేశారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నత హోదాలు ఉంచినందుకు రాజాఅన్నమలై మంద్రం, చెన్నైగ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ(అమెరికా) నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం ఆయన రామగుండంలోని మైనార్టీ గురుకులంలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. గోలేటి వాసికి డాక్టరేట్ రావటంపై అంతా హర్షిస్తున్నారు.

16న గంగాపూర్ జాతర వేలం

రెబ్బెన, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాపూర్ శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఫిబ్రవరి11,12,13 తేదీల్లో జరగనున్న జాతరను పురస్కరించుకొని ఈనెల16న వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. తైబజారుతో పాటు ప్రసాద విక్రయం, వాహనాల పార్కింగ్, కొబ్బరికాయల విక్రయానికి సంబంధించిన వేలంప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



ఆసిఫాబాద్‌లో జరిగిన కార్యక్రమాల్లో బియ్యం పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు, పార్టీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు, ఆదర్శ బాలికల పాఠశాలలో పూల మాల వేస్తున్న డీవైఎస్‌వో రమాదేవి

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీజిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, విజయ్, మల్లికార్జున్ యాదవ్, అరుణ్ లోయ, విజయ్, నరేష్, మణిక్‌రావు, సురేష్, జయరాజ్, శంభ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లాకేంద్రంలోని వివేకానందచౌక్‌లో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో స్వామివివేకానందుడి విగ్రహానికి పూల మాలలు వేసి జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం దివ్యాంగులకు బియ్యం, దుప్పట్లు, బ్లాంకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ సభ్యులు శ్రీనివాస్, కృష్ణమూర్తి, శంకర్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

● స్వామి వివేకానందను యువతస్ఫూర్తిగా తీసుకోవాలని డీవైఎస్‌వో రమాదేవి అన్నారు. ఆదివారం గిరిజన ఆదర్శ బాలికల క్రీడాపాఠశాలలో జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జీసీడీవో శకుంతల, హెచ్‌ఎం జంగు, కోచ్‌లు అరవింద్, రాకేష్, ఏఎన్ఎం కృష్ణవేణి పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: స్వామివివేకానంద ఆశయాలను కొనసాగిద్దామని బీజేపీజిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి ఆశయాల కొనసాగించేందుకు యువత ముందుండాలన్నారు.

దహెగాం: మండలకేంద్రంలోని అంగడిబజార్‌లో ఆదివారం స్వామివివేకానంద జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ధనుంజయ్, నాయకులు సంతోష్‌గౌడ్, పరమేశ్వర్, గంగాధర్, సంజీవ్, మల్లేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం: ఎస్పీ



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 12(ఆంధ్ర జ్యోతి): క్రీడాపోటీల్లో గెలుపు ఓటములు సహజమని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ క్రీడామైదానంలో పోలీసులకు, జర్నలిస్టులకు మధ్య ఫ్రెండ్లీక్రికెట్ మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ప్రెస్‌టీం 8ఓవర్లలో 58 పరుగులు చేయగా పోలీసుజట్టు 5ఓవర్లలో లక్ష్యాన్ని అధిగమించింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఓటమిచెందిన క్రీడాజట్టు నిరు త్సాహ పడకుండా భవిష్యత్‌లో గెలుపునకు ప్రయత్నించాలన్నారు. అనంతరం విన్నర్, రన్నర్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్‌ఐ పెద్దయ్య, అంజన్న, సీఐలు రాణాప్రతాప్, రవీందర్, శ్రీనివాస్. సత్యనారాయణ, ఎస్సై చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కెరమెరి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ మోతీరాం, మాజీ వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాం, జడ్పీటీసీ ద్రుపతాబాయి అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నసాకడలో నిర్వహిస్తున్న పెందూర్ జంగుపటేల్ స్మారకకబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. అంతకుముందు జంగుపటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌రావు, జలపతిరావు, సుమిత్రబాయి, తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట తస్మాత్ జాగ్రత్త..

● ఊరికి వెళితే పోలీసులకు సమాచారమిస్తే మేలు
● జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న పోలీసులు

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 12: సంక్రాంతి పండుగకు ప్రభుత్వం విద్యాసంస్థలకు ఈనెల 17వరకు సెలవులు ప్రకటించింది. దీంతో చాలామంది ఇళ్లకు తాళాలువేసి సొంత ఊర్లకు వెళ్తుంటారు. అలాంటివారు ముందు జాగ్రత్తగా స్థానికపోలీసులకు సమాచారమిస్తే పరిసరాలపై నిఘాఉంచే అవకాశం ఉంటుందని పోలీసులు ప్రకటించారు. గత సంవత్సరం దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలప్పుడు చోరీలు జరిగి అనేకమంది ఇళ్లల్లో నగలు,డబ్బువిలువైన డాక్యుమెంట్లు పోయాయి. దీంతో ఈసారి పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి, లేదా వ్యాపార సముదాయాల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాని తద్వారా చోరీలు జరగకకుండా ఉండడంతోపాటు, జరిగిన చోరీలను ఛేదించి నిందితులను సులభంగా గుర్తించేందుకు ఉపయోగపడుతాయని పేర్కొంటున్నారు.

పోలీసుల సూచనలు ఇలా..

✓పండుగ సందర్భంగా ఊర్లకు వెళ్లేవారు నగదు, బంగారు ఆభరణాలు తమవెంట తీసుకెళ్లాలి. లేదా బ్యాంకులాకర్లలో భద్ర పరుచుకోవాలి.

✓ఊరికి వెళ్లేటప్పుడు వారి పరిధిలోని పోలీ సుస్టేషన్‌లో సమాచారం అందిస్తే పోలీసులు నిఘా ఉంచుతారు.

✓తాళంవేసిన తరువాత తలుపులు కనిపించకుండా కర్టెన్ వేయాలి.

✓ఇంటి ఎదురుగా లైట్‌వేసి ఉంచాలి, ఇరుగుపొరుగు వారికి ఇంటిని, పరిసరాలను గమనించాలని చెప్పాలి.

✓ఇంట్లో ఎవరూ లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చమని చెప్పాలి. ఇంటి ముందు చెత్త చెదారం, పాల ప్యాకెట్లు జమ కానివ్వడకుండా చూసుకోవాలి. వాటిని గమనించి దొంగలు దొంగతనాలకు పాల్పడే అవకాశాలుంటాయి.

✓సెలవుల్లో బయటికి వెళుతున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్‌లాక్ సిస్టం ఉండే తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్ ఏర్పాటు చేసుకోవడం మంచిది.

✓ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే లేదా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి

✓సోషల్‌మీడియాలో మీ లోకేషన్, ట్రావెల్ చేసేప్రాంతం వివరాలు, ఇతరత్ర ప్రణాళికలు, ఎప్పుడు ఎక్కడికి వెళుతున్నారో అనే అప్డేట్స్ షేర్ చెయవద్దు.

✓మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి. బైక్‌లు తప్పనిసరిగా చైన్స్‌తో లాక్ చెయ్యడం మంచిది.

✓నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్‌మెన్/సెక్యూరిటీ గార్డ్/సర్వెంట్స్‌గా నియమించుకోవాలి

✓అమర్చుకొన్న సీసీకెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు మొబైల్ ఫోన్‌లో ప్రత్యక్షంగా చూసుకోవచ్చు. సెక్యూరిటీకి సర్వైలెన్స్‌కు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయి

చోరీల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం..
- రాజేంద్రప్రసాద్, ఇన్‌స్పెక్టర్, కాగజ్‌నగర్ టౌన్



చోరీల నియంత్రణకు ఇండ్లల్లో, వ్యాపార సముదాయాల ముందు సీసీ కెమెరాలు బిగించుకోవాలి. ఎటువంటి అనుమానం వచ్చిన 100లేదా పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేయాలి. పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరిస్తే నేరాలను అదుపులో ఉంచవచ్చు.

ఆరె సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తా: ఎమ్మెల్సీ



జీజాబాయి చిత్రపటానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

సిర్పూర్(టి), జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆరెసంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండెవిఠల్ అన్నారు. శివాజీ తల్లి జీజాబాయి జయంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండు ఏరియాలో శివాజీ జెండా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సిర్పూర్(టి), దహెగాం మండలాల్లో ఆరె సంఘం భవన నిర్మాణానికి రూ.25లక్షలచొప్పున ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరయితే నిర్మాణాలు చేపడుతామన్నారు. మండల కేంద్రంలో ఆరె కులస్తులు స్థలం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం దుబ్బగూడ, డౌనల్‌ఏరియాలోని శివాజీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆరెసంఘం నాయకులు శంకర్, సిడాం గణపతి, నానాజీ, ఎల్ములె కిశోర్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, తుల సీరాం, రాజు, అబ్దుల్ అకీల్, మోహన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబయిన పోతరాజు ఆలయం

● ఈనెల15, 16, 17 తేదీల్లో ఉత్సవాలు



పోతరాజు ఆలయం

కెరమెరి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందాపూర్ గ్రామసమీపంలోని పెద్దవాగు సమీపంలో గల పోతరాజు ఆలయం జాతరకు ముస్తాబయింది. ప్రతి యేటా మూడురోజులపాటు జరిగే ఉత్సవాలను ఈ ఏడాది నిర్వహించేందుకు ఆలయకమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈఆలయంలో అనేక దేవతా మూర్తుల విగ్రహాలు కొలువై ఉన్నాయి. ఈ ప్రాంతంలో రుషులు, మునులు తపస్సు చేసినట్లుగా పూర్వీకులు తెలుపుతున్నారు. కొలాం గిరిజనులు పోతరాజును తమ ఇంటిల్లి పాది క్షేమంగా ఉండాలని అలాగే పంటలు సంవృద్ధిగా ఉండాలని మొక్కులు చెల్లించుకుంటారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సిడాం రాజు తెలిపారు.

ఆలయానికి వెళ్లే దారి..

ఆసిఫాబాద్ నుంచి సావర్‌ఖేడ(ధనోర) గ్రామం నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో పోతరాజు ఆయలం ఉంది. ఉట్నూరు నుంచి వచ్చే భక్తులు కెరమెరి మీదుగా సావరకేడ రోడ్డు(ధనోర) నుంచి నేరుగా ఆలయానికి చేరుకోవచ్చు.

నేడు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జిమంత్రి, రాష్ట్రగ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క నేడుజిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.15గంటలకు రెబ్బెనమండలం గంగాపూర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయఆర్చ్‌కు శంకుస్థాపన, అనంతరం ఆసిఫాబాద్‌మండలం జన్కాపూర్‌లో బాలసదన్, వాంకిడి మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం ఆవిష్కరణ, జన్కాపూర్‌లోని సబ్‌జైలు జంక్షన్‌లో రహదారి భద్రత అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం జోడేఘాట్‌లో పర్యాటకశాఖ ప్రాజెక్టుల శంకుస్థాపన, కెరమెరి మండలం కోటపరందోళి ఆలయసందర్శన ఉంటుందని తెలిపారు.

కెరమెరి: మండలంలో సోమవారం మంత్రి సీతక్క పర్యటిం చనున్నారు. జోడేఘాట్‌లో పలుఅభివృద్ధి పనులకు శంకుస్థాపనతోపాటు పరందోళి, ముక్దంగూడ గ్రామాల్లోని అడవుల్లోకొలువైన జంగుబాయి క్షేత్రం సందర్శించి పూజలు నిర్వహించనున్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

● కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామానుజం

కాగజ్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ వినయ్‌గార్డెన్ సమీపంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్డన్‌సెర్చ్‌లో ఇంటింటా తనిఖీ చేస్తామన్నారు. లైసెన్సు లేని వాహనాలు, ఎవరైన కొత్త వ్యక్తులు న్నారా? అనేకోణంలో వివరాలు సేకరిస్తామన్నారు. పట్టణ, రూరల్ సీఐలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది ఎవరినీ ఇబ్బంది పెట్టే కార్యక్రమం కాదన్నారు. దీనికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. లైసెన్సులు లేని60 వాహనాలను సీజ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోతే చావు డప్పు తప్పదు

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాదిగ



డప్పులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బెజ్జూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 7లోగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోతే ముఖ్యమంత్రి చావుడప్పు తప్పదని ఎమ్మార్పీఎస్ రాష్ట్రఅధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాదిగ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో 'లక్ష డప్పులు- వేల గొంతులు' మహాప్రదర్శనలో భాగంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రధానవీధుల్లో డప్పులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి తక్షణమే ఏబీసీడీవర్గీకరణ అమలుచేయాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా తామేంటో చూపిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మయ్య, శ్రీనివాస్, శ్రీశైలం, వెంకటేష్, బాపు, లచ్చన్న, వెంకటేష్, అనీల్, సత్యనారాయణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సంక్షేమానికి కృషి

● జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ నాయకులు

చింతలమానేపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ, పీఎంపీల సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు ఆసంఘం జిల్లాఅధ్యక్షుడు అజయ్ కుమార్ అన్నారు. మండలకేంద్రంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆర్ఎంపీ, పీఎంపీ రాష్ట్రఅధ్యక్షుడు వెంకన్న సతీమణి లక్ష్మి నర్సమ్మ అకాల మృతి చెందగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, మెహరాజ్, వినోద్, చారి, విశ్వాస్, చౌదరి హరి, హరికృష్ణ, శంకర్, శేఖర్, చందు, లక్ష్మణ్‌గౌడ్, దిలీప్, తిరుపతి, సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

పెంచికలపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆగర్‌గూడ గ్రామానికి చెందిన ఆలం సకారాం కోడలు ఆలం అనూష ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధితకుటుంబాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయనవెంట మాజీసర్పంచ్ సుధాకర్, నాయకులు ఇస్తారి, ఎంకన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌కమిటీ కార్యాలయ ఆవరణలో ఆదివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు స్పెషల్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డీటీడీవో రమాదేవి, ఏసీడీవో శకుంతలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు బాలేష్‌గౌడ్,చరణ్,హసద్,వినోద్,తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చిన్నమ్మను హత్య చేసిన అక్క కొడుకు


మడావి కౌసల్య (ఫైల్)

దండేపల్లి(జన్నారం), జనవరి 12(ఆంధ్రజ్యోతి): జులాయిగా తిరుగుతున్న అక్క కొడుకుకు మంచి మాట చెప్పినందుకు కక్ష పెంచుకుని చిన్నమ్మను హత్య చేసిన సంఘటన జన్నారం మండలం దేవునిగూడ పంచాయతీ పరిధి కొత్తూర్‌పల్లెలో చోటుచేసుకుంది. పర్థానిగూడకు చెందిన మడావి కౌసల్య(57) భర్తను వదిలి ఒంటరిగానే తల్లి ఇంటి వద్ద ఉంటుంది. ఆమెకు పిల్లలు లేకపోవడంతో అక్క కొడుకు కుర్సింగ మోహన్‌ను దత్తత తీసుకుంది. మోహన్ సోదరుడు కృష్ణకు రెండు పెళ్ళిళ్లు జరగగా విడాకులయ్యాయి. అప్పటి నుంచి మోహన్ ఇంట్లో ఉంటూ జులాయిగా తిరుగుతున్నాడు. ఇది గమనించిన కౌసల్య ఈనెల 11న కృష్ణను ఏదైన పని చేసుకొని బతకాలని మందలించింది. దీంతో కృష్ణ చిన్నమ్మపై కక్ష పెంచుకొన్నాడు. ఆదివారం ఉదయం కౌసల్య పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తుండగా కృష్ణ వెంబండించి గ్రామ శివారులో గొడ్డలితో మెడ, తల భాగంపై దాడి చేసి హతమార్చిన పోలీసులకు లొంగిపోయాడు. మోహన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. సంఘటన స్థలానికి సీఐ అల్లం నరేందర్ చేరుకొని వివరాలు సేకరించారు.

కోడి పందేల స్థావరాలపై పోలీసుల దాడులు

కోటపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నాగంపేట, బొప్పారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఆదివారం కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో ఏడుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకోవడంతోపాటు 10 పందెం కోళ్లు, 7 మొబైల్ ఫోన్‌లు, రూ.59,780 నగదు, నాలుగు బైక్‌లను సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. పోలీసుల రాకను గమనించి పందెంరాయుళ్లు వాహనాలను వదిలేసి పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కేసులు

లక్షెట్టిపేట, జనవరి,12 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఎవరైన కోడి పందాలను నిర్వహిస్తే కేసులు తప్పవని ఎస్సై సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైన కోడి పందేలు జరిగితే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై ప్రకటనలో పేర్కొన్నారు.

కోడిపందేల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

కాగజ్‌నగర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి గ్రామశివారులో కోడిపందేల స్థావరంపై టాస్క్‌ఫోర్సు సీఐ రాణాప్రతాప్, ఎస్సై వెంకటేష్ దాడులు నిర్వహించారు. రాస్పెల్లిలో కోడి పందెలు నిర్వహిస్తున్నట్టు పక్కాగా సమాచారం అందగా దాడులు చేసి కోడి పందేలు ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారివద్ద ఉన్న నాలుగు కోడిపుంజులు, రూ.3020నగదు, పది మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారిని ఈసుగాం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్టు తెలిపారు.

గంజాయి పట్టివేత

తాండూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రేచిని గ్రామంలో ఆదివారం గంజాయి పట్టుకున్నట్లు సీఐ కుమారస్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రేచిని గ్రామానికి చెందిన వ్యక్తులు ఈజ్‌గాంలో గంజాయికొని గ్రామంలో దాచి పెట్టారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ కిరణ్‌కుమార్ సిబ్బంది వెళ్లి గంజాయిని పట్టుకున్నామన్నారు. సునార్కర్ రమణ, మచ్చ రాకేష్, కొడిపె నాగార్జున, చింతపురి శ్రీనివాస్‌ల వద్ద నుంచి 1150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు.

క్రషర్‌లో నలిగిన చేయి

బెజ్జూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సలుగుపల్లి గ్రామానికిచెందిన నైతం శ్రీకాంత్ చెయ్యి ప్రమాద శాత్తు క్రషర్‌లో పడడంతో గాయాలయ్యాయి. ఆదివారం తన పొలంలో వడ్లు నూర్పిడి చేస్తుండగా ప్రమాదవశాత్తు చేయి క్రషర్‌లోపడి గాయాలయ్యాయి. అప్రమత్తమైన రైతులు చికిత్స కోసం అతన్ని కాగజ్‌నగర్ పట్టణానికి తరలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వాంకిడి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనర్‌గాం గ్రామ శివారులో పేకాటస్థావరంపై ఆదివారం ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో దాడులు పోలీసులు నిర్వహించారు. ఎనిమిది మంది పేకాట ఆడుతుండగా నలుగురిని పట్టుకున్నామని ఎస్సై తెలిపారు. వారివద్ద నుంచి రూ.4200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురిని అరెస్టు చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

కన్నెపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): లింగాల పంచాయతీ పరిధిలోని చింతపుడి గ్రామానికి చెందిన తుమ్మిడి గణేష్ (24) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గణేష్ కొంత కాలంగా మద్యానికి బానిసై తల్లిదండ్రులు చెప్పిన మాట వినకుండా తిరుగుతున్నాడు. ఆదివారం పొలానికి నీరు పెట్టి రమ్మని తల్లిదండ్రులు చెప్పడంతో పొలం వద్దకు వెళ్లిన గణేష్ మద్యం మత్తులో అక్కడ ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు బెల్లంపల్లిప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి భీమయ్యఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత

దండేపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారావుపేట గ్రామానికి చెందిన కాంత అనే మహిళ కిరాణా దుకాణానికి వెళ్ళి మొబైల్ ఫోన్ పోగొట్టుకుంది. ఆమె ఫిర్యాదు చేయగా కానిస్టేబుల్ కిరణ్ గ్రామంలోని సీసీ కెమెరాల ఆధారంగా కనుక్కొని అప్పగించారు. ఎస్ఐ ఉదయ్ కిరణ్ బాధితురాలికి అందజేశారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

నెన్నెల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని మండల అధ్యక్షుడు అంగల్ శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు అండగా ఉంటామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. మాజీ మండల అధ్యక్షుడు శైలేందర్ సింగ్, కోట వంశీ, గడ్డం శ్రీనివాస్ గౌడ్, కూనారపు రాజన్న, దుర్గం శంకర్, రాజన్న, సతీష్, మహేష్, సుధాకర్, పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

లక్షెట్టిపేట రూరల్, జనవరి,12 (ఆంధ్రజ్యోతి): వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం బోడకుంటి మహేష్ స్మారక కబడ్డీ పోటీలను లక్షెట్టిపేట ఎస్సై-2 పనాస రాజయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కబడ్డీ ఆటతో దేహదారుఢ్యంను పెంపొందించుకోగలుగుతామని గుర్తు చేశారు. పోటీ దారులు క్రీడలను స్నేహపూర్వకంగా ఆడాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అన్ని పార్టీల నాయకులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి

మంచిర్యాల క్రైం, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తానని డా. బండారి నరేందర్‌రావు (బీఎన్‌రావు) అన్నారు. ఆదివారం ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. మెదక్ కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ నిరుద్యోగుల ఉపాధి కల్పన లక్ష్యంగా పని చేస్తానని హామీ ఇచ్చారు. అడ్వకేట్ ఎర్ర లచ్చన్న, దొమ్మటి అర్జున్, జయరావు, బేర ప్రభాకర్, డా. మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గాలి పటం.. ఇదో లెక్కల మంత్రం



- సంక్రాంతికి పతంగుల సందడి
- నాటి బాలతరం పతంగి ఆటలతోనే మానసిక, శారీరక ఉల్లాసం

వాంకిడి, జనవరి 12: సక్రాంతి పర్వదినం సెలవులొచ్చాయంటే విద్యార్థులకు ఎంతో సంతోషం. ఎక్కడ లేని ఆనందం. వారం రోజులు సందడిగా గడపొచ్చన్న భావన, ఈ ఆనందంలో ఇళ్ల ముందే పిల్లలంతా గుమిగూడుతారు. పతంగులు ఎగరేసుకోవాలంటూ అమ్మ దగ్గర కెళ్తారు. రూ. ఐదు కావాలంటారు. పట్టుబట్టి మరీ వసూలు చేస్తారు. తలక్కున మెరిసే పేపర్లతో రెడీ మేడ్‌గా రూపొందించిన గాలిపటం కొనుక్కుని వస్తారు. ఇళ్లవద్ద ఎగరేస్తుం టారు. నేటి తరానికి ఇంతవరకే తెలుసు. నాటి బాలతరం ఇలా చేయలేదు. ఇంటింటికి తిరిగి పాతపత్రికలను అడుక్కొచ్చేవారు. ఇళ్లలో దొరక నప్పుడే కొనుక్కొచ్చేవారు. పతంగి తయారీ కోసం మెదడుకు పదును పెట్టేవారు. ఇదో గణితసూత్ర మంత్రం అనేంతగా సందడి చేసేవారు. నాడు ఆకా శంలో ఎగిరిన ఆ పతంగుల రూపకల్పన సందడి వెనక.. వారు పఠించిన ఆ గణిత మంత్రాలను నేటి తరం ఆచరించాల్సిన ఆవశ్యకత ఉందని విద్యా వేత్తలు అభిప్రాయపడుతున్నారు.

● ఇదో గణిత సూత్రం..

నాటి బాలతరం గణితంలో ఆకారాలు, సూత్రాలను గుర్తు చేసుకుంటూ గాలిపటం తయారు చేసేవారు. మొదట పాత పత్రికలను సేకరించేవారు. ఒక పేజీని నాలుగు భుజాలు సమానంగా ఉండే (చతురస్రాకారం)లా కత్తిరిస్తారు. ఇళ్లలో కొబ్బరి పుల్లలు చీపుళ్ల నుంచి రెండు తీసుకుంటారు. వాటిలో ఒకదా నిని చతురస్రాకారంలో కత్తిరించిన కాగితం మధ్యలో భుజాల అభిముఖంగా(కర్ణం) మరో పుల్లను వంచి(అర్థ వ్యాసం) కాగితం మూడు మూలలు కలుపుతూ గంజి లేదా అన్నంతో అంటిస్తారు. వారి అభిరు చిని బట్ట కొన్ని పతంగులకు కాగితం ముక్కల్ని సన్న (దీర్ఘ చతురస్రాకారం)గా కత్తిరించి పొడుగ్గా కొన్నిం టికేమో చిన్న (త్రిభుజాకారం)గా తోకనంటిస్తారు. మొత్తంగా గణితంలో ఆకారాలు, వాటిసూత్రాలు పతంగి తయారీ ద్వారా మరోసారి గుర్తు చేసుకునేవారు.

● స్నేహితుల సహకారం..

ఈ గాలిపటం తయారీకి అవసరమైన కాగితం సేకరణ దగ్గర్నుంచి ఎగరవేసేంత వరకు స్నేహితుల సహకారం తప్పనసరి. కనీసం ఇద్దరి, ముగ్గురి భాగ స్వామ్యం ఉంటుంది. గాలిపటాలు కూడా ఒక్కడే ఎగరేయడు. ఒకరు దానిని ఆకాశంలో గద్దలకు పోటీ గా ఎగిరేలా గాలి పటానికి అను గుణంగా దారం చేతుల్లో ఆడిస్తారు. ఇంకొకరు కండేనికి దారం చుడు తూ వదులుతూ ఉంటారు. ఇంకొకరు అది కింద పడకుండా జాగ్రత్తలు, సలహాలు ఇస్తుంటారు. ఇలా రకరకాలుగా ఒకరికొకరు సహకారం తీసుకుంటుంటారు. గ్రూపు సందడికి ఇది సంకేతం. సమూహంగ ఏర్పడితేనే ఏదైనా సాధన. రూపకల్పన చేయొచ్చనేది ఈ విషయ సారాంశం.



● రూపకల్పనలో సృజనాత్మకత..

రూపకల్పనలో సృజనాత్మకత గణితసూత్రాలు ఉన్న గాలిప టాన్ని పైకి ఎగిరించాలంటే దారం అవ సరం. ఆ రోజుల్లో మీటర్ల కొద్ది పొడవుండే దారం కండెలను కొనుక్కొచ్చేవారు. ఆ తర్వాత గాలి పటం బ్యాలెన్స్ తప్పకుండా కర్ణం, అర్థ వ్యాసం గల పుల్లకు ఇరువైపులా రంధ్రం చేసి దారం లాగి కడతారు. దారం బిగింపులో ఏమాత్రం ఎగుడుతిగుడుగా ఉన్నా.. గాలి పటం ఎగరదు. గాలిపటం ఎగిరేది ఈ దారం కట్టే సృజనాత్మకత పైనే ఆధారపడి ఉంటుందన్నది దీనర్థం.

జాగ్రత్తలు తప్పనిసరి..



గాలిపటాల్ని ఎగరేసేటప్పుడు పైన పిట్టగోడ లేని భవనం ఎక్కొద్దు. సాధారణ దారాన్నే వాడాలి. తప్ప నిసరిగా పక్కన పెద్దలుండాలి. విద్యుత్ తీగలకు దగ్గరగా వెళ్లొద్దు. ఇవన్నీ ఒక ఎత్తైతే నాటి బాలతరం అడుగుజాడల్లో పతంగి ఆటలు ఆడితేనే మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుంది.

- వడ్లూరీ రాజేశ్- ఉపాధ్యాయుడు

పతంగులు ఎగురవేసే వేళ జాగ్రత్త

జైపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి అంటేనే పతంగుల పండగ. పల్లెల్లో ఇప్పటి నుంచే పతంగుల సందడి ఊపందు కుంది. దుకాణా ల్లో రంగురంగుల పతంగులు విక్రయిస్తున్నారు. పాఠశాలకు సెలవులు రావడంతో విద్యార్థులు గాలిపటాలను ఎగురవేస్తున్నారు. చిన్నా పెద్ద పతంగులు ఎగురవేయడానికి ఆసక్తి చూపు తున్నారు. పతంగులు నింగిలో ఎగురుతుంటే పిల్లల కేరింతలు హోరెత్తుతాయి. పతంగులు ఎగురవేయడంలో చైనా మాంజవాడవద్దని, పక్షు లకు, మనుషులకు హాని కలుగుతుండడంతో అటవీశాఖ 2007లో నిషేధించింది. పలుచోట్ల పతంగులను ప్రమాద కర ప్రాంతాల్లో ఎగురు వేస్తున్నారు. పండగ వేళలో జాగ్రత్తలు పాటించ కుంటే విషాదం చోటు చేసుకునే అవకాశం ఉంది.

- శిథిల భవనాలు, రక్షణ గోడ లేని భవనాలు, నిర్మాణంలో ఉన్న, నీటి ట్యాంకుల పైకి ఎక్కి పతంగులు ఎగురవేయవద్దు.
- సీసీ రోడ్లు, రహదారుల వద్ద మాంజా దారం వేలాడుతూ కనిపిస్తే తీసివేయాలి. లేకుంటే వాహనదారులు, పాదాచారులకు తగిలి గాయాలయ్యే పరిస్థితి ఉంది.
- బహిరంగ ప్రదేశాల్లోనే పతంగులు ఎగురవేయాలి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, కరెంటు తీగల వద్ద ఎగురవేయవద్దు. విద్యుత్ తీగల మీద పడిన గాలి పటాలను తీసేందుకు ప్రయత్నించవద్దు.
- మెటాలిక్ దారాలు వినియోగించడం వల్ల విద్యుతాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది.

చైనామాంజపై నిషేధం

- రామకృష్ణ సర్కార్, జైపూర్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్

పతంగులు ఎగురవేసేటప్పుడు చైనామాంజ వాడొద్దు. ఈ దారంతో మనుషులు, పక్షులకు ప్రమాదం పొంచి ఉంది. చైనామాంజదారాన్ని అటవీశాఖ నిషేధించింది. ఇప్పటికే పతంగుల దుకాణాలు, కిరాణ దుకాణాల్లో తనిఖీలు చేపట్టాం. చైనామాంజ విక్రయిస్తే చర్యలు తప్పవు. సంక్రాంతి సెలవులకు ముందు మాంజదారం వాడవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించాం.

రైల్వే పరిధిలో గాలి పటాలు ఎగురవేయవద్దు

తాండూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ప్రాంగణాల్లో, పట్టాల సమీపంలో, విద్యుత్ లైన్లవద్ద గాలి పటాలను ఎగురవేయవద్దని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ ఎల క్ట్రికల్ సీనియర్ డీఈఈ సయ్యద వసీం పాషా ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా రైల్వేప్రాంతాల్లో విద్యుతాఘాతంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని తెలిపారు. గత సంక్రాంతి సీజన్‌లో పలువురు ప్రమాదాల్లో మృతిచెందారన్నారు. 25కేవీ ట్రాక్షన్ ఓవర్ హెడ్ కండక్టర్లలో చిక్కుకున్న గాలిప టాల దారాలను తాకడంతో విద్యుతా ఘాతంకు గురయ్యే అవకాశాలుంటాయని తెలిపారు. ఈ విషయాలను అందరు గమనిం చాలన్నారు.

ఘనంగా మాతా జీజాబాయి జయంతి

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆరె సంక్షేమసంఘం భవనంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మాతృమూర్తి జీజాబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆరె సంఘంనాయకులు జయరాం, దాదారాం, ఓమాజీ, ననాజీ, గోపాల్, తిరుపతి, అన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: ఛత్రపతి శివాజీ మహారాజ్ తల్లి మాతాజీజాబాయి 427వ జయంతిని ఆదివారం మండల కేంద్రంలోని జేతావన్ బుద్ధవిహార్ (బీఎస్ఐ) ఆధ్వర్యంలో గనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పశ్చిమకనుమలలో గొప్ప పేరుపొందిన రాయ్‌ఘడ్ కోటను జయించి ఛత్రపతి శివాజీమహారాజ్‌కు పట్టాభిషేకం చేయించ డానికి ఆమె చేసిన కృషిని ఈసందర్భంగా పలువురు కొనియా డారు. కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లాఅధ్యక్షుడు మహోల్‌కార్ అశోక్, మండలఅధ్యక్షుడు ఉగ్రెజైరాం, విలాస్, రాజేంద్ర ప్రసాద్, దుర్గం ప్రశాంత్, దుర్గం శ్యాంరావు, హంసరాజ్, ప్రతాప్,విఠ్ఠల్,రోషన్, తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న ఆరె సంఘం నాయకులు


వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న బీఎస్ఐ నాయకులు

కౌటాల: మండలకేంద్రంలోని ఆరెసంఘ భవనంలో జీజాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం స్వామి వివేకానంద జయంతిని జరుపుకున్నారు. కార్యక్రమంలో కుల పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు)లో 13.7డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏజెన్సీమండలాలు చలికి వణికి పోతున్నాయి. ఆదివారం సిర్పూర్ (యు) మండలంలో అత్యల్పంగా 13.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. తిర్యాణి మండలం గిన్నెధరిలో 14.1, తిర్యాణిలో 14.7 కెరమెరిలో 14.8 రెబ్బెన, వాంకిడిలలో 15.1డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలినుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు చలిమంటలు కాగుతున్నారు.

రాంనగర్‌లో క్రీడా పోటీలు

జైనూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానిగూడ పంచాయతీలో గల రాంనగర్‌లో ఆదివారం పవార్ భీంరావ్ నాయక్‌స్మారక క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లోపాల్గొని ప్రతిభ కనబర్చాలని కళాకారుడు పవార్ మోహన్‌నాయక్, మాజీసర్పంచ్ పూసం రాములు తెలిపారు. ఈ సందర్భంగా పవార్ భీంరావ్ నాయక్ సేవల్ని వారు కొనియాడారు. నాయకులు పవార్‌మోహన్‌నాయక్, దయాకర్ జాదవ్, మేస్రాం బారిక్‌రావ్ పటేల్ పాల్గొన్నారు.

వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయఆవరణలో ఆదివారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శ్రీనివాస్, వెంకన్న, ప్రమోద్, పాల్గొన్నారు.

వారసంతలో సంక్రాంతి సందడి

బెజ్జూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం మండలకేంద్రంలో వారసంత కావడంతో మహిళలు, ముగ్గుల కోసం వివిధ రకాల రంగులు, నోము సామగ్రి కొనుగోలు చేయడానికి తరలి వచ్చారు. 14న సంక్రాంతి, 15న కనుమ పండగ నేపథ్యంలో ముఖ్యంగా మహిళలు నోము నోచుకోవడం ఆనవాయితీ.


బెజ్జూరు సంతలో విక్రయిస్తున్న రంగులు

యువత సన్మార్గంలో నడవాలి: ఎస్సై

దహెగాం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలని ఎస్సై రాజు అన్నారు. ఆదివారం మండలంలోని కల్వాడలో మాట్లాడుతూ యువకులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని వారికి జరిమానా విధించారు.

టోకెన్ సమ్మెను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల18న నిర్వహించే టోకెన్‌సమ్మెను విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ ఏరియాఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి కోరారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రధానంగా బెస్ట్‌అలవెన్స్ రూ.5వేలు ఇవ్వాలని, భూనిర్వాసితులకు, కొన్నేళ్లుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్‌చేయాలని, తదితర డిమాండ్లుచేస్తూ ఈనెల18న నిర్వహించే టోకెన్‌సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్‌ఆర్గనైజింగ్ కార్యదర్శి దుర్గం లక్ష్మణ్, నాయకులు పొన్నగంటి అశోక్, తుల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి సీఎండీ అభినందన

శ్రీరాంపూర్, జనవరి12(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే5 గనిలో పనిచేస్తున్న ప్రదీప్‌రావు ఎరవెల్లిని సీఎండీ ఎన్ బలరాం ప్రత్యేకంగా అభినందించారు. ప్రదీప్‌రావు రాష్ట్రప్రభుత్వ అధికార మాసపత్రిక 'తెలంగాణ'లో ఈనెలలో 'రాష్ట్ర ప్రగతిలో సింగరేణి' అనేవ్యాసం అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగి సంస్థపై మంచి వ్యాసం రాయడం అభినందనీయమన్నారు.



ఓపెన్‌కాస్టులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

బెల్లంపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): శాంతిఖని, శ్రావణ్‌పల్లి ఓపెన్ కాస్టులకు వ్యతిరేకంగా త్వరలో ఉద్యమాలు చేపడతామని ఓపెన్‌కాస్టుల వ్యతిరేకపోరాట కమిటీ జేఏసీ నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో కార్మికసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శాంతిఖని, శ్రావణ్‌పల్లి ఓపెన్‌కాస్టులను ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం విరమించుకోవాలని లేనియెడల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు మణిరాంసింగ్, చాంద్‌పాషా, కారుకూరి రాంచందర్, కొయ్యల ఏమాజీ, రాజన్న, కొమ్మెర లక్ష్మణ్, నాతరి స్వామి తదితరులు పాల్గొన్నారు.


ఓపెన్‌కాస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

కార్మికుల సొంతింటి కలను నెరవేరుస్తాం

- ఇన్‌కం టాక్స్ రద్దుకు కృషి చేస్తున్నాం
- రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్


మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

మందమర్రిటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సొంతింటి కలను నెరవేర్చి తీరుతామని ఆదిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీసవేతనాల సలహామండలిచైర్మన్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన మందమర్రిఏరియా ఐఎన్‌టీయూసీ జనరల్‌బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం సాధించింది ఏమీలేదన్నారు. ప్రతి నెల ఇన్‌కంటాక్స్‌తో కార్మికులు నష్టపోతున్నారని ముఖ్యమంత్రికి వివరించామన్నారు. యాజమాన్యమే చెల్లించేలా ప్రభుత్వంతో ఒత్తిడి చేయిస్తామని తెలిపారు. యూనియన్ నాయకులు, కార్యకర్తలు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమానికి ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య అధ్యతవహించారు. కార్యక్రమంలో కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, చీఫ్‌ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్, నాయకులు మిట్ట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అందరితో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

అంతరిస్తున్న పశు సంపద



- వేధిస్తున్న పశుగ్రాసం కొరత
- తగ్గుతున్న ఆహార పంటల సాగు విస్తీర్ణం
- వాణిజ్య పంటల సాగు వైపే ఆసక్తి

కాసిపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంలో వచ్చిన సాంకేతికతో పశు సంపద కరువవుతోంది. పశుగ్రాసం కొరత పశువుల యజమానులను తీవ్రంగా వేధిస్తుంది. ఆహార పంటల సాగు విస్తీర్ణం తగ్గి వాణిజ్య పంటలపై రైతులు ఆసక్తి పెంచు కోవడంతో రైతులకు పశుపోషణ మరింత భారంగా మారింది. వరి సాగు విస్తీర్ణం కాస్త మెరుగు పడినప్పటికీ వ్యవసాయ కూలీల కొరతను అధిగమించేందుకు రైతులు హార్వెస్టర్(వరికోత మిషన్)లపై ఆధారపడడంతో పశుగ్రాసానికి వరిగడ్డి కరువవుతుంది. మేతకు అడవికి వెళితే అటవీ అధికారుల ఆంక్షలు పశువుల యజమానులకు తలనొప్పిగా మారాయి. దీంతో పల్లెల్లో పశుపోషణ కానరావడం లేదు. పశు సంపదను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



ప్లాస్టిక్ కవర్లు తింటున్న ఆవులు

● జిల్లాలో సాగు విస్తీర్ణం

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం 1,56,237 ఎకరాల్లో సాగు చేయగా పత్తిని 1,57,645 ఎకరాల్లో చేస్తున్నారు. అంతర పంటగా వేసే అనుములు, చిక్కులు, బబ్బెర్లు కంటికే కానరావడం లేదు. మొక్కజొన్న 77 ఎకరాల్లో సాగు చేస్తే, వేరుశనగ 45ఎకరాలు, సోయా 16 ఎకరాలు, మినుములు 15ఎకరాలు, కంది 695 ఎకరాల్లో సాగు చేయగా పెసర కేవలం 26ఎకరాల్లో మాత్రమే సాగవుతుంది. దీంతో పశుగ్రాసం కొరత తీవ్రంగా వేధిస్తోంది. పత్తి తీసిన తర్వాత పత్తి కట్టెను సైతం రైతులు చేన్లలోనే తగలబెట్టడంతో పశువులకు మేత దొరకడం లేదు. రోడ్లపై పడేసిన చెత్త పేపర్లు, ప్లాస్టిక్ కవర్లు, తిని పడేసిన ఇస్తారాకులే వాటికి ఆహారంగా దొరుకుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు తిన్న మూగజీవాలు రోగాల బారిన పడి మృత్యువాతకు గురవుతున్నాయి.

● అంతరిస్తున్న పశు సంపద

పశుగ్రాసం కొరతతో పోషణ భారమైన రైతులు పశువులను కబేళాలకు అమ్ముతున్నారు. దీంతో జిల్లాలో పశుసంపద ఏడాదికి ఏడాదికి గణనీయంగా తగ్గుతుంది. ఐదేండ్లకు ఒకసారి చేపట్టే పశుగణన గణాంకాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. 2014లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చేపట్టిన గణాంకాల సర్వేలో ఆవులు 10,09,975 ఉండగా, గేదెలు 3,18,406 ఉన్నాయి. గొర్రెలు 6,95,125 ఉండగా, మేకలు 5,88, 340 ఉన్నాయి. అలాగే 2019లో సర్వేలో మంచిర్యాల జిల్లాలో ఆవులు 1,79,757, గేదెలు, 1,05,798, గొర్రెలు 5,20,731, మేకలు 1,83,526 ఉన్నాయి. 2024లో చేపట్టిన పశుగణన సర్వే నవంబరులో ప్రారంభమైంది. ప్రతి 5ఏండ్లకు ఒకసారి చేపట్టే పశుగణాంక సర్వేలో 20శాతం పశుసంపద తగ్గుతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఇదే విధానం కొనసాగితే అనతి కాలంలోనే పశుసంపద అంతరించిపోయే ప్రమాదం ఉంది.

మాకు పదికి పైగా ఆవులు ఉండే



గతంలో మా ఇంట్లో 10కి పైగా ఆవులు ఉండేవి. కానీ ఇప్పుడు మేతకు కష్టమై, పశువులు కాపర్లు దొరకక పశువులను అమ్ముకున్నాం. పశువులను కాపాడుకునే విధానం తెలియక చాలా మంది పనుల కోసం పట్టణాలకు పోతున్నారు. సంక్రాంతి పండగ వస్తే ఇంటి ముందు గొబ్బెమ్మలు పెట్టుకోవడానికి పేడ కూడా దొరకడం లేదు.

- దెవుసాని శంకరయ్య, రైతు, మల్కేపల్లి

సమగ్ర వ్యవసాయంలో పశు సంపద అంతర్భాగమే



సమగ్ర వ్యవసాయ విధానంలో పశు సంపద అంతర్భాగమే. రైతులు పశు పోషణను సమృద్ధిగా చేపట్టాలి. రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గిపోయి భూమి నిర్జీవంగా మారిపోతుంది. దీంతో పంటల దిగుబడి తగ్గి రైతుకు నష్టం మిగుల్చుతుంది. సేంద్రియ వ్యవసాయం అందుబాటులోకి రావాలంటే పశు పోషణ పెరగాలి. రసాయనిక ఎరువుల వాడకంతో వాతావరణ సమతుల్యత దెబ్బతిని పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

- రాజనరేంద్ర, వ్యవసాయ సహాయ సంచాలకులు

పశుగ్రాసానికి కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం



పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. గతేడాది పశుగ్రాసం కొరత లేకుండా చేసేందుకు రైతులకు స్వీట్ సూడాన్ గ్రాస్ 22 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలను అంద జేశాం. ఇవే కాకుండా ఇతర విత్తనాలను రైతులకు అందజేస్తున్నాం. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రైతులకు రూ. 2 లక్షల వరకు ఎలాంటి షూరిటీ లేకుండా ఆవులను, గేదెలకు రుణాలను బ్యాంకులు అందిస్తు న్నాయి. పశుక్రాంతి ద్వారా అర్హులైన వారిని ఎంపిక చేసి రుణాలను అందజేస్తున్నాం. యువత స్వయం ఉపాధి కింద గేదెలు, మేలు జాతి ఆవులను తీసుకుని పాల ఉత్పత్తి పెంచేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. పశుపోషణ పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది.

- శంకర్, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు

గుట్టలు కరుగుతున్నాయ్

3వ పేజీ తరువాయి..



గూడెం గుట్టలో అక్రమంగా చేపట్టిన తవ్వకాలు

శాటిలైట్‌తో నిఘావేసి, సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలి. గుట్టలు, ప్రభుత్వ స్థలాల్లో అనుమతులున్న కాంట్రాక్టర్లు తమ పరిధిలోనే తవ్వకాలు చేపడుతున్నారా, అక్రమాలకు పాల్పడుతు న్నారా గమనించాల్సి ఉంది. దీంతోపాటు ఎంత విస్తీర్ణం లో రాయి, మట్టి తవ్వకాలు జరుగుతున్నాయో సర్వే జరిపి మైనింగ్ శాఖ అధికారులకు రిపోర్టు చేయాలి. ఆయా సంస్థలు ఎలాంటి సర్వే జరుపకపోవడంతో గుట్టలో అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది.

ముగిసిన కబడ్డీ పోటీలు



గెలుపొందిన జట్టుకు బహుమతి అందజేస్తున్న రఘునాథ్

లక్సెట్టిపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న కబడ్డీ పోటీలు ఆదివారం ముగిసాయి. పోటీల్లో సుమారు 52టీంలు పాల్గొనగా అంకత్‌పల్లి జట్టు మొదటి బహుమతి సాదించింది. ద్వితీయ కన్నెపల్లి జట్టు గెలుపొందగా వెర్రబెల్లి రఘునాథ్ నగదుతోపాటు ట్రోఫీని అందించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్‌రావు, మండల అధ్యక్షుడు నాగిరెడ్డి హేమంత్‌రెడ్డి, నాయకులు రజినీష్ జైన్, గుండ ప్రభాకర్, బుద్దె లక్ష్మణ్, రమేష్ జైన్, గురువయ్య, గోపతి రాజన్న పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

బెల్లంపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : బట్వాన్‌పల్లి గ్రామంలో ఫ్రెండ్లీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు మాజీ ఎంపీపీ తొంగల మల్లేష్, రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, మండల అధ్యక్షుడు సత్యనారాయణలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలతో మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కిరణ్‌కుమార్, శ్రావణ్, శ్యామ్, సుధాకర్, నవీన్, రాజశేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): వేంపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ డేగ బాపు ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. 7 టీంలు పాల్గొన్నాయి. మంగళవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించి మొదటి బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ. 3వేలు అందిస్తామని తెలిపారు. సత్యం, నగేష్, సృజన్, వరుణ్, మహేందర్, సాయి, వెంకటేష్, సురేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముల్కల్లలో గ్రామస్థాయి క్రికెట్ పోటీలు కాంగ్రెస్ నాయకులు నాయికిని సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు తహసీల్దార్ శ్రీనివాస్‌రావుదేశ్‌పాండే, ఎస్‌ఐ గోపతి సురేష్‌లు బహుమతులు అందించారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో దోహద పడతాయన్నారు. కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువకులకు వాలీబాల్ కిట్ల పంపిణీ

భీమిని, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం చిన్నగుడిపేట గ్రామ యువకులకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా వాలీబాల్ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొని గ్రామానికి, మండలానికి పేరు తీసుకరావాలన్నారు.

నియామకం

కోటపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బిల్లా తిరుపతయ్య పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం జిల్లా కార్యనిర్వహక సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతయ్యను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

కోటపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని జేఏసీ నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం వచ్చే నెల 7లోపు వర్గీకరణ చేపట్టాలని, లేనిపక్షంలో మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 21న నియోజకవర్గంలో వెయ్యి డప్పుల కార్యక్రమం నిర్వహిస్తామని వచ్చే నెల 7న హైద్రాబాద్‌లో జరగనున్న వెయ్యి గొంతుకలు, లక్ష డప్పుల సమావేశానికి మాదిగలంతా తరలి రావాలన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, మాజీ జెడ్పీటీసీ మోతె తిరుపతి, మాజీ వైస్‌ఎంపీపీ వేముల రాజన్న, కలగూర రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



దండేపల్లి, చెన్నూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దండేపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2004-05లో పదో తరగతి వరకు చదివిన వారు ప్రభుత్వ ఉద్యోగాలు, వ్యాపార, రాజకీయ రంగాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆదివారం సుమారు 100మందికి పైగా పూర్వవిద్యార్థులు ఇరవై ఏండ్ల క్రితం వారు చదివిన పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉత్సాహంగా గడిపారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1975-76 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఎస్‌ఎస్‌ఆర్ ఫంక్షన్‌హాలులో ఘనంగా నిర్వహించారు. ఒకరి యోగక్షేమాలను ఒకరు అడిగి తెలుసుకున్నారు.

చదువు నేర్పిన గురువులు పులి రామన్న, ఆడువాల లచ్చయ్య, చంద్రయ్య, సాధిక్ అలీలను సన్మానించారు. పూర్వ విద్యార్థులు ప్రకాష్, మహేష్, శ్రీనివాసరావు, రమేష్‌బాబు, శ్రీనివాస్, మధుకర్, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన రంగవల్లులు



గెలుపొందిన విజేతకు బహుమతి అందజేస్తున్న కౌన్సిలర్

లక్సెట్టిపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. 30మంది మహిళలు పాల్గొన్నారు. పోటీలకు జడ్జీలుగా పైడిపల్లి అరుణ, పెండెం శంకరమ్మ, కనకతార వ్యవహరించారు. వ్యాపారులు సిసోడియా రమేష్‌చంద్, నరేష్ చంద్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రాజలింగులు బహుమతులను అందజేశారు. రమేష్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 5వ వార్డులో కౌన్సిలర్ హరికృష్ణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ అంజలి, ద్వితీయ అమర, తృతీయ అరుణ, ఐదుగురికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవో కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కౌన్సిలర్ సీపతి సుమతి మల్లేష్‌లు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సీనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సుమలత, రజిత, రవళి, జూనియర్ విభాగంలో అక్షర, నవ్య, యుక్త గెలుపొందగా బహుమతులను అందించారు. ముగ్గుల పోటీకి న్యాయనిర్ణే తులుగా సునిత, అరుణ, స్వప్న,సత్యవతిలు వ్యవహరించారు. కార్యక్రమ కన్వీనర్ గుండేటి యోగేశ్వర్, సొసైటీ నాయకులు పొన్న మల్లయ్య, సీపతి బాబూరావు, అహ్మద్, రమేష్ పాల్గొన్నారు.

అలిశెట్టి జయంతి



కవి ప్రభాకర్‌కు నివాళులర్పిస్తున్న కవులు

గర్మిళ్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎనభై, తొంభై దశకాల్లో ఆనాటి రుగ్మతలను సమాజానికి చాటిన కవి అలిశెట్టి ప్రభాకర్ అని పలువురు కవులు పేర్కొన్నారు. ఆదివారం అమరవీరుల స్థూపం వద్ద అలిశెట్టి ప్రభాకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సాహిత్యానికి చేసిన సేవలను కొనియాడారు. కవులు ముత్యం నాగవర్మ, శ్రీమన్నారాయణ, అల్లాడి శ్రీనివాస్, భరత్, లక్ష్మారెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం



చెన్నూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని జగన్నాథస్వామి ఆలయంలో ధనుర్మాసం తిరుప్పావై వ్రతం సందర్భంగా ఆదివారం నర్సింహ సుదర్శన హోమంను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దామెర మోహనాచార్యులు, అనిలాచార్యులు, అరుణాచలం విజయ్ ఆచార్యులు వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



రెబ్బనపల్లిలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మందమర్రిలో వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీఐ, జీఎం

దండేపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానందుడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. రెబ్బనపల్లిలో ఆదివారం వివేకానంద జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. స్వామి వివేకానంద ఆశయ సాధనకు యువత కృషి చేయాలన్నారు. రాజయ్య, గురువయ్య, శ్రీనివాస్, వెంకటేష్, సంతోష్, అశోక్, మల్లేష్, సంతోష్, సత్తయ్య పాల్గొన్నారు. కొండాపూర్‌లో స్వామి వివేకనంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. అడ్వకేట్ గంట నారాయణ, జిల్లా ధర్మజాగర్న లీగల్ సెల్ లక్ష్మీరాజం పాల్గొన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. క్యాలెండర్ ఆవిష్కరించారు.

మంచిర్యాల క్రైం, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం కాలేజీ రోడ్డులోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రావుల మహేష్, సభ్యులు సంపత్, రవిందర్, తిరుపతి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): ఆవడం ఎక్స్‌రోడ్డు వద్ద స్వామి వివే కానంద జయంతి నిర్వహించారు. రేషవేణి శ్రీనివాస్, కొక్కుల నరేష్, సత్యనారాయణ, మల్లేష్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ప్రజావెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అజుమొద్దీన్ వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్‌కుమార్, జావేద్‌పాషా, రమేష్, సతీష్ పాల్గొన్నారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణం సీసీసీ కార్నర్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురష్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు సత్రం రమేష్, నాయకులు కమలాకర్‌రావు, నాగేశ్వర్ రావు, సుమన్, సదానందం, శ్రీనివాస్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని బాయ్స్ స్కూల్ మైదానంలో కొమురంభీం సేవా సమితి నాయకులు వివేకానంద జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగిల్ విండో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్, గట్టయ్య, శ్రీధర్,పున్నం, వాకర్‌లు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): యువత వివేకానందున్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సీఐ శశిధర్‌రెడ్డి, ఏరియా జీఎం దేవేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఎం శ్యాంసుందర్, సిరాజ్‌ఉర్‌రహమాన్, అనంతచారి పాల్గొన్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని బీజేపీ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణాధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల పల్లె నిద్ర

భీమారం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఖాజీపల్లి పంచాయతీ పరిధిలోని గోత్రాల గూడెం గ్రామంలో శనివారం రాత్రి ఎస్‌ఐ శ్వేత పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రజలందరు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఏదైనా ఆపద వస్తే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య, హోంగార్డు సదాశివ్, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

రిపోర్టర్ హత్యను ఖండిస్తున్నాం

శ్రీరాంపూర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జంక్షన్ రిపోర్టర్ ముఖేష్ చంద్రాకర్‌ను కొందరు వ్యక్తులు హత్య చేయడాన్ని ఖండిస్తున్నట్లు సింగరేణి ఉదోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవి సత్యనారాయణ, రాజయ్య, బెల్లంపల్లి సారయ్య తెలిపారు.

పండగకి ఊరెళ్తున్నారా.. జరభద్రం....

- వరుస సెలవుల నేపథ్యంలో చోరీలకు అవకాశం
- బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఇంట్లో ఉంచుకోవద్దు
- దొంగతనాల నివారణకు పోలీసుల సూచనలు

దండేపల్లి, జనవరి12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు వరుస సెలవులు రావడంతో చాలామంది బంధువుల ఇళ్లకు, స్వగ్రామాలకు, విహారయాత్రలకు వెళ్తుంటారు. పిల్లలతో కలిసి కుటుంబమంతా సొంత ఊళ్ళకు వెళుతున్నారు. ఇళ్లకు తాళం వేసి వెళ్లిన వారు జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే చోరీ జరిగే అవకాశం లేకపోలేదు. దొంగతనం జరగకుండ ఉండేందుకు చర్య తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ముందస్తు అప్రమత్తతతో చోరీలను కట్టడి చేయొచ్చని డీసీసీ ఎగ్గడి భాస్కర్ పేర్కొన్నారు.

- ఇళ్లలో విలువైన వస్తువులు, నగదు బంగారు ఆభరణాలు పెట్టవద్దు. బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.
- పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించమని తెలుపాలి.
- బీరువాలకు సంబంధించిన తాళాలు ఇంట్లో పెట్టొదు.
- ఇంట్లో సమ్మకమైన వారిని సెక్యూరిటిగా పెట్టుకోవాలి, సెంట్రల్ లాక్‌సిస్టం ఉన్న తాళాలను అమర్చుకోవాలి.
- బస్సు, రైలు ప్రయాణాల్లో అపరిచిత వ్యక్తులు ఇచ్చిన తిను బండారాలు తీసుకోకూడదు.
- ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు అగుపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. లేదంటే 100కు డయల్ చేయాలి.
- వాహనాలను ఇంటి ఆవరణలో పార్కు చేసి తాళం వేయాలి.
- ఇంట్లో సీసీ కెమెరాలను అమర్చుకొని వాటిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూస్తుండాలి.
- ఊరెళ్లే ముందు ఇంటి ఆవరణలో ఉన్న లైట్లు వేసి వెళ్లాలి.
- సోషల్ మీడియాలో మీరు బయటికి వేళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం మంచిదికాదు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

3

సోమవారం 13 జనవరి 2025

గాలి పటం.. ఇదో లెక్కల మంత్రం

- సంక్రాంతికి పతంగుల సందడి
- నాటి బాలతరం పతంగి ఆటలతోనే మానసిక, శారీరక ఉల్లాసం

4



అంతరిస్తున్న పశుసంపద

- వేధిస్తున్న పశుగ్రాసం కొరత
- తగ్గుతున్న ఆహార పంటల సాగు విస్తీర్ణం
- వాణిజ్య పంటల సాగు వైపే ఆసక్తి

5



ప్లాస్టిక్ కవర్లు తింటున్న ఆవులు

గుట్టలు కరుగుతున్నాయ్

- అనుమతులు గోరంత.. తవ్వకాలు కొండంత
- క్వారీ తవ్వకాల్లో నిబంధనలు గాలికి
- పరిధి దాటి ముందుకెళ్తున్న లీజుదారులు
- పట్టించుకోని అధికారులు



బొక్కల గుట్టలో అక్రమంగా తవ్విన మట్టి

మంచిర్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల ధనదాహానికి కొండలు కరిగిపోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకపోయినా అక్రమంగా గుట్టను తవ్వి మట్టిని తరలించుకుపోతున్నా అడిగేవారు లేరు. కాంట్రాక్టర్లకు రాజకీయ నాయకుల మద్దతు ఉండడంతో మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. కంటి తుడుపు చర్యగా అప్పుడప్పుడు వాహనాలను పట్టుకొని జరిమానాలు విధిస్తూ సరిపెడుతున్నారు. మందమర్రి మండలంలోని బొక్కల గుట్టతోపాటు దండేపల్లి మండలంలోని పుణ్యక్షేత్రమైన గూడెం సత్యనారాయణ స్వామి గుట్టను కూడా నామరూపాల్లేకుండా కొల్లగొడుతున్నారు.

అనుమతులు లేకున్నా..

బొక్కలగుట్ట, గూడెం గుట్టల్లో మట్టి తవ్వకాలకు ఉన్న పరిమితులు దాటి తవ్వకాలు చేపడుతున్నా అడిగే వారు లేరు. నిత్యం వందలాది ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ అక్రమంగా లక్షలు గడిస్తున్నారు. మట్టి తవ్వకాలకు నిబంధనల మేరకు ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ.75 అడ్వాన్స్ రాయల్టీ, 30శాతం డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్టీ), 2శాతం స్టేట్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్టు(ఎస్ఎంఈటీ) ఫీజులతోపాటు 2 శాతం ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. మట్టి తవ్వకాలు జరిపే సమయంలో ప్రతిసారీ మళ్లీ పర్మిట్లు తీసుకోవలసి ఉంటుంది. ఇవేమీ చెల్లించకుండానే నిత్యం దాదాపు 500 క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించుకు పోతున్నట్లు సమాచారం. గుట్టల నుంచి తవ్విన మట్టిని ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్న వారు కోట్లు గడిస్తుండగా, ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలో గండి పడు తోంది. మట్టితో పాటు పర్మిట్లు లేకుండా గుట్టల్లో రాయి తవ్వకాలు చేపడుతూ అందినకాడికి దండుకుంటున్నారు. బొక్కలగుట్ట నుంచి గృహ అవసరాల కోసం రాయిని తవ్వేందుకు తిమ్మాపూర్ శివారు 139 సర్వే నెంబర్‌లో మోహన్, సుధాకర్ అనే ఇద్దరు వ్యక్తులకు 1.10 ఎకరాలు, 2 ఎకరాల చొప్పున లీజుకు ఇస్తూ మైనింగ్‌శాఖ పర్మిట్లు జారీ చేసింది. సదరు కాంట్రాక్టర్లు తమ పరిధి దాటి తవ్వకాలు జరుపుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఎక్కువ తవ్వకాలు జరిపిన ఇద్దరు లీజుదారులకు మైనింగ్‌శాఖ అధికారులు జరిమానాలు సైతం విధించారు. రాయల్టీ చెల్లించకుండా తవ్వకాలు జరిపిన క్వారీ నిర్వాహకులకు అధికారులు జరిమానా విధించారు. బొక్కలగుట్ట మండలం తిమ్మాపూరుకు చెందిన భీమ సుధాకర్‌కు రూ.1.46 కోట్లు, పులిమడుగు గ్రామానికి చెందిన భుక్య మోహన్‌కు రూ.1.62 కోట్లు జరిమానా విధించడం గమనార్హం. అయినా లీజుదారుల్లో మార్పులు రావడం లేదు. ఇదిలా ఉండగా వారికి అధిక మొత్తంలో జరిమానాలు విధించగా అవి చెల్లించకపోవడం, కోర్టులో కేసులు ఉండడంతో ఈ రెండు క్వారీల అనుమతులు ప్రభుత్వం రద్దు చేసింది. అయినప్పటికీ యథావిధిగా క్వారీల నుంచి మొరం, రాయి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. స్థానికంగా ఓ పలుకుబడి కలిగిన నేత ఈ అక్రమ వ్యవహారం చేస్తూ దండుకున్నట్లు ఆరోపణలున్నాయి. అలాగే గూడెం గుట్ట నుంచి పెద్ద మొత్తంలో మొరం, బండ అక్రమతవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

డిజిటల్ సర్వే బాధ్యతలు..

గుట్టలు, ఇతర ప్రభుత్వ భూముల నుంచి రాళ్లు, మట్టి తవ్వకాలపై నిఘా వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డీజీపీఎస్, ఈటీఎస్ అనే డిజిటల్ సర్వే బాధ్యతలను మహారాష్ట్రలోని నాగపూర్ చెందిన ఓ ఏజెన్సీకి అప్పగించింది. ఆయా స్థలాల్లో జరుగుతున్న తవ్వకాలపై ఈ సంస్థ ఎప్పటికప్పుడు..

మిగతా 5లో

14న సైకిల్ పోటీలు

హాజీపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సందర్భంగా హాజీపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న సైకిల్ రేస్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రెస్‌క్లబ్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గుడిపేట శివారులోని బుగ్గ గట్టు ఆంజనేయస్వామి విగ్రహం ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో పోటీలు నిర్వహిస్తామన్నారు. 10వ తరగతిలోపు విద్యార్థులకు నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.3 వేలు, ద్వితీయ రూ.1500, పాల్గొన్న వారికి షీల్డ్‌లు అందించనున్నట్లు తెలిపారు.

నేడు గోదాదేవి కల్యాణం

మందమర్రిరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ పూజారులు అనంతాచారి, నర్సింహాచారిలు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు గోదా రంగనాథ స్వామి కల్యాణం వైభవంగా జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా జెండా పండగ

తాండూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ కొలవార్ భీమ దేవర జెండా పండగను బోయపల్లి గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బోనాలు సమర్పించి భీమన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో ఆదివాసీ కొలావార్‌లు, మహిళలు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలను పరిష్కరించాలి

కన్నెపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వీవోఏల సమస్యలను పరిష్కరించాలని సంఘం అధ్యక్షుడు గంధం దాసు, కార్యదర్శి జుమ్మిడి లక్ష్మణ్‌లు పేర్కొన్నారు. ఆదివారం కన్నెపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వీవోఏలకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, బీమా, హెచ్‌ఆర్ అమలు చేయాలని, 58 జీవో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భీమ్‌సేన్, ధర్మయ్య, శంకర్ పాల్గొన్నారు.

సభ పోస్టర్ల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో ఈనెల 18న జరిగే ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్లను ఆదివారం మార్క్స్‌భవన్‌లో నాయకులు విడుదల చేశారు. సభకు కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఐఎఫ్‌టీయూ నాయకులు శ్రీనివాస్, బ్రహ్మానందం, రామన్న, మల్లన్నదేవయ్యగణేష్, అరుణ, సురేందర్, శేఖర్ పాల్గొన్నారు.

ఎస్టీపీపీకి సేఫ్టీ అవార్డు

జైపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటుకు 2024 సంవత్సరానికి సేఫ్టీ ఎక్సలెన్స్-పవర్ థర్మల్ సెక్టర్ విభాగంలో 1వ గ్రీన్ ఎన్విరో సేఫ్టీ అవార్డు, గోల్డ్ అవార్డు లభించినట్లు ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు ఆదివారం పేర్కొన్నారు. ఈ నెల 11న న్యూఢిల్లీలో జరిగిన గ్రీన్ ఎన్విరో సేఫ్టీ అవార్డు 2025 పురస్కారంలో ఎస్టీపీపీ ప్రతిష్టాత్మక సేఫ్టీ అవార్డు లభించిందన్నారు. ఎస్టీపీపీలో జీరో యాక్సిడెంట్‌లు, సురక్షిత ప్రణాళికలు, ఆధునిక సాంకేతిక వినియోగం, పరిసరాల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలకు అవార్డు వచ్చిందని తెలిపారు. వివేక్ శ్రీవాత్సవ ఐపీఎస్ అధికారి నుంచి ఎస్టీపీపీ అధికారులు ధరావత్ పంతుల, అవినాష్‌దూబే, పులి సురేష్‌లు అందుకున్నారు. సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్ సత్యనారాయణరావు, సోలార్ జీఎం జానకిరామ్ అధికారులు, ఉద్యోగులను అభినందించారు.



న్యూ ఢిల్లీలో సేఫ్టీ అవార్డులను అందుకుంటున్న ఎస్టీపీపీ అధికారులు

శాలివాహన భూములను అమ్మవద్దని నిరసన



ధర్నా చేస్తున్న కార్మికులు

మంచిర్యాల క్రైం, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : పాత మంచిర్యాలలో శాలివాహన పవర్ ప్లాంటును మూసివేసి ఆ భూమిని అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని ప్లాంటులో పని చేస్తున్న కార్మికులు ఆదివారం గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్లాంటు మూసివేసి బెనిఫిట్స్ చెల్లించకుండా కంపెనీ యజమాని మల్కా కొమురయ్య కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కంపెనీకి చెందిన భూములను కొందరు రియల్ వ్యాపారులకు అమ్మే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎవరైనా రియల్ వ్యాపారులు భూమిని కొంటే అడ్డుకుంటామని హెచ్చరించారు. సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, మాజీ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, శెట్టి శ్రీనివాస్, దేవి ప్రసాద్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూంల పంపిణీలో అవకతవకలు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రిటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఇటీవల పంపిణీ చేసిన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పంపిణీలో కాంగ్రెస్ నాయకులు అనర్హులను ఎంపిక చేశారని బీఆర్ఎస్ నాయకులు జె. రవీందర్, మేడిపల్లి సంపత్, బండారి సూరిబాబులు పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ నిరుపేదల కోసం డబుల్‌బెడ్‌రూం పథకం ప్రవేశపెట్టారని తెలిపారు. మందమర్రిలో 560 గృహాలను నిర్మించామన్నారు. అధికారులతో పాటు కాంగ్రెస్ నాయకులు కూడా సర్వే చేసి లబ్దిదారులను ఎంపిక చేశారని ఆరోపించారు. మందమర్రిలో కేవలం 243 మంది మాత్రమే పేదలు లేరని, చాలా మంది ఉన్నారని తెలిపారు. అర్హులకు ఇల్లు వస్తే తాము హర్షిస్తామని, కానీ నాయకులు చెప్పిన వారికి లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయడం సరైంది కాదన్నారు. కొంగల తిరుపతిరెడ్డి, ఓ. రాజశేఖర్, బడికెల సంపత్, సదానందం, అబ్బాస్, మల్లేష్, వీరారెడ్డి, వెంకన్న, రాజనర్సు, అశోక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి

నస్పూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామో దర్ రెడ్డి అన్నారు. సీసీసీలోని ఎంఎం గార్డెన్‌లో ఆదివారం పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారమయ్యే విధంగా చూస్తానన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో సంఘం అభ్యర్థులు వంగ మహేందర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డిలను గెలిపించాలన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బచ్చ మోహన్‌రావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా మహేశ్వర్, రాష్ట్ర అసోసియేట్ సభ్యుడిగా తిరుపతయ్య, మీడియా ఇన్‌చార్జీగా కే.తిరుపతిలను ఎన్నుకున్నారు. మోహన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు కొండు జనార్దన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు శాంకరి, ఆసిఫా బాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పాల్గొన్నారు.

చెస్ పోటీలు మేథాశక్తికి దోహదం



చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మందమర్రిటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): చెస్‌పోటీలు యువతలో మేథాశక్తికి దోహదపడతాయని సీఏ శశిదర్‌రెడ్డి, జీఎం దేవేందర్‌లు పేర్కొన్నారు. ఆదివారం పంచముఖి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల స్థాయి చెస్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా చెస్‌పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపోటములను ఒకే విధంగా తీసుకుని క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ నాయకులు సిరాజ్ ఉర్ రహమాన్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చైతన్య,ఆచార్య, శంకర్‌రావు, ఉమ్మడి జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ కనకయ్య, ఆర్బిటర్ కల్పన, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని చాటిన స్వామి వివేకానంద



కలెక్టరేట్‌లో స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్ర జ్యోతి) : దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహా నికి పూలమాలలువేసి నివాళులర్పిం చారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయం లో స్వామి వివేకానంద జయంతి నిర్వ హించారు. ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి నివా ళులర్పించారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు జ్ఞాపికలు అందించారు. వెంక టేశ్వర్లు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కాలేజీ రోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌వెరబెల్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. రాజ్‌కుమార్, రజనీష్‌జైన్, పురుషోత్తం, ఆంజనేయులు, శ్రీదేవి, సతీష్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఐడీఓసీ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు అబ్దుల్ రహీం, ప్రేమ్‌కుమార్‌లను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతి, రాజేష్, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. కాలేజీ రోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహానికి ఫిట్‌నెస్ సెంటర్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెంటర్ అధ్యక్షుడు దాసరి కుమార్, నాయకులు ఆంజనేయులు, రామన్న, చంద్రకాంత్, అశోక్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహిస్తేనే గుర్తింపు



ఉద్యోగుల్లో చేరిన వారిని సన్మానిస్తున్న సంఘ నాయకులు

దండేపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు సాధించిన యువత విధులను సక్రమంగా నిర్వర్తిస్తేనే సమాజంలో గుర్తింపు వస్తుందని మున్నూర్ కాపు ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోండు జనార్దన్, మండల అధ్యక్ష కార్యదర్శు బొలిశెట్టి రాజన్న పోల్లంపల్లి శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. దండేపల్లిలో ఆదివారం ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన మున్నూర్ కాపు యువకులను సన్మానించారు. వారు మాట్లాడుతూ పేదలకు సమాజానికి మనవంతుగా సాయం అందించాలన్నారు. వివిధ ఉద్యోగ శిక్షణ పొందుతున్న వారికి స్ఫూర్తిగా నిలవాలన్నారు. నాయకులు కిషన్, సత్యనారాయణ, మనోహర్, రామన్న, పాల్గొన్నారు.

ఇంటింటా సంక్రాంతి సందడి

- నేడు భోగి, రేపు సంక్రాంతి, 15న కనుమ



దండేపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పల్లెలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. ఇండ్ల ముందు గొబ్బెమ్మలు, గంగిరెద్దుల విన్యాసాలు, పిండి వంటల గుమగుమలు అల్లుళ్ళ కోలాహలంతో సంక్రాంతి సందడి మొదలైంది. సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగను మకర సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా జరుపుకుంటున్నారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పిల్లల ఆటాపాటలు, బంధువుల రాకపోకలతో గ్రామాలు సందడిగా మారాయి. పట్టణాల్లో ఉండే వారంతా కుటుంబ సభ్యులతో సొంత ఊరికి వచ్చారు. సంక్రాంతి పండుగను ఈనెల 13 భోగి, 14న మకర సంక్రాంతి, 15న కనుమగా మూడు రోజుల పాటు జరుపుకుంటారు. సంక్రాంతి పది రోజుల ముందు నుంచే పల్లెల్లో గంగిరెద్దుల ఆటలు, హరిదాసు కీర్తనలు వినిపిస్తాయి. ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దుతున్నారు. చిన్నారులు వారివారి ఇండ్లపై గాలిపటాలు ఎగురవేస్తూ ఆటాపాటలతో గడుపుతున్నారు. మరోవైపు మహిళలు వారివారి ఇండ్లలో పిండి వంటలు తయారు చేయడంలో నిమగ్నమయ్యారు.

భోగ్యమైన భోగి..

భోగికి పది రోజుల ముందు నుంచే భోగి పిడుకలు పెట్టి మధ్యలో రంధ్రం చేసి హారంగా తయారు చేస్తారు. పిడుకల హారంతోపాటు ఇంట్లోని నిరుపయోగ వస్తువులు, పాత సామానులు భోగి మంటల్లో వేస్తారు. విభూతి ధరిస్తారు. చిన్న పిల్లలకు రేగుపళ్ళు, రాగి నాణేలు, చెరుకు ముక్కలు, నువ్వులు, పిండి వంటలు కల్పి తలపై నుంచి జారే విధంగా భోగి పళ్లు పోస్తారు.

పుణ్యప్రద సంక్రమణం..

సంక్రాంతి లక్ష్మీ ఆగమనానికి సంకేతం. శ్రీమన్నారాయణుడితో కలిసి లక్ష్మీదేవి రంగురంగుల ముగ్గుల రథానెక్కి వస్తుందంటారు. ఈ రోజు ముగ్గులకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. లక్ష్మీతో పాటు సంక్రాంతి పురుషుడు, బలి చక్రవర్తి ఇంటికి వచ్చి శుభాలనిస్తారనే భావనతో ప్రతి ఇంటిని ఆవు పేడతో శుభ్రంగా అలికి, ముగ్గులు పెట్టి, పసుపు కుంకుమలతో గొబ్బెమ్మలను తయారు చేస్తారు. కూరపిండి ఆకు, రేగుపళ్లు, నువ్వులు ముగ్గులో ఉంచుతారు. రాక్షసుల బాధ భరించలేని లక్ష్మీదేవి గోమయంలో దాగి ఉండగా ఆ రూపమే గొబ్బెమ్మ అని చెప్పుతూ పూజించే సాంప్రదాయం అనాదిగా వస్తోంది.

రైతుల పండుగ కనుమ ..

సంక్రాంతి మరుసటిరోజు కనుమ రైతులకు సంబంధించిన పండుగ. పశువులను పూజించడంలో భాగంగా ఎద్దుల కొమ్ములకు రంగులు వేసి ముస్తాబు చేస్తారు. గిట్టలనుకడిగి పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. పశువుల శాలల ను పేడతో అలిగి ముగ్గులు పెట్టి పొంగలి వండి పాలు పొంగిస్తారు.

సంస్కృతి సంప్రదాయాల సంక్రాంతి



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి పండగ నిదర్శనమని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంసీ మైదానంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు రంగు రంగుల రంగవల్లులు వేశారని, సంస్కృతి, సంప్రదాయాలు ముగ్గుల్లో కనిపించాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి జయ, రెండో బహుమతి భార్గవి, మూడో బహుమతి లక్ష్మీలు గెలుచుకున్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్ బండి ప్రభాకర్, నాయకులు మునిమంద రమేష్, ఏసీపీ రవికుమార్ పాల్గొన్నారు.